సాక్షి
నల్లగొండ
శనివారం ı 21 ı జనవరి ı 2023



తాటికల్‌లో వ్యక్తి హత్య
నకిరేకల్ మండలం తాటికల్‌లో శుక్రవారం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు.
- 8లో



ఇద్దరి ఆత్మహత్య
ఆర్థిక ఇబ్బందులతో వెలిమినేడు శివారులో ఇద్దరు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- 8లో

గరిష్టం/కనిష్టం
30.0°/18°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

గుర్రంపోడు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మట్లాడారు. ప్రజలు కంటి సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రజలంతా కంటి సమస్యలు చేయించుకొనేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ సుధాకర్, డాక్టర్ భవానిచక్రవర్తి తదితరులు ఉన్నారు.

పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నకిరేకల్ : నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్, కామర్స్, తెలుగు సబ్జెక్టులు బోధించడానికి అర్హత కలిగిన వారిని నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులు సాధించినవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 25 లోపు దరఖాస్తులు చేసుకోవాలని, 27న కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆర్‌ఎం'

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలియజేసేందుకు శనివారం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్‌టీసీ ఆర్‌ఎం.వరప్రసాద్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు 86881 95076 ఫోన్ నంబర్ ద్వారా.. మధ్యాహ్నం 12గంటల నుంచి ఒంటి గంట మధ్య తమ సమస్యలు తెలియజేయొచ్చని పేర్కొన్నారు.

22న 'అగ్నికణాలు' పుస్తకావిష్కరణ సభ

రామగిరి(నల్లగొండ) : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కోమటిరెడ్డి అనంతరెడ్డి రచించిన విప్లవోద్యమ చరిత్రలో అగ్నికణాలు పుస్తకావిష్కరణ సభ ఈ నెల 22న నల్లగొండలోని లయన్స్ క్లబ్ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా నాయకుడు మేకరాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఏ.నర్సింహారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి పాల్గొంటారని తెలిపారు.

గ్రంథాలయ సంస్థ బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

రామగిరి (నల్లగొండ) : జిల్లా గ్రంథాలయ సంస్థ 2023 – 24 సంవత్సరానికి రూ.6.66 కోట్ల బడ్జెట్ అంచనాలను కమిటీ ఆమోదించింది. నల్లగొండలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ రేగట్టే మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ భవన నిర్మాణాలు, స్వీపర్ చార్జీల పెంపు విషయంపై చర్చించారు. సమావేశంలో వివిధ శాఖ అధికారులు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రాంచందర్, లక్ష్మీనారాయణ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ ఈ నెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కున్‌రెడ్డి నాగిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష రూపాయల రైతుల రుణమాఫీని ఏకకాలంలో చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బండా శ్రీశైలం, కుంభం కృష్ణారెడ్డి, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కరెంటోళ్ల వింతపోకడ!

ఇల్లు ఏదైనా.. రెండు కిలోవాట్ మీటర్లు అంటగడుతున్న విద్యుత్‌శాఖ

- మీటరు కావాలంటే రూ.3300 డీడీ తీయాలని ఆదేశాలు
- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మన జిల్లాలోనే ఈ విధానం
- అధికారుల అత్యుత్సాహంతో పేదలపై భారం



నల్లగొండ : విద్యుత్‌శాఖ అధికారులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పేదలపై భారం మోపుతున్నారు. అవసరం లేకున్నా అధికలోడ్ మీటర్లు అంటగడుతూ అధిక మొత్తం వసూలు చేస్తున్నారు. వాస్తవంగా తక్కువ విద్యుత్ అవసరం ఉన్న పేదలు ఒక్క గది ఉండి మీటర్ పొందాలంటే ఒక కిలోవాట్ సామర్థ్యం గల మీటరు సరిపోతుంది. కానీ, రెండు కిలోవాట్ల మీటర్ తీసుకోవాల్సిందేనని జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. మీటర్లు పొందే పేదల నుంచి ముక్కుపిండి ఒక్కో మీటర్‌కు రూ.3300 డీడీ రూపంలో వసూలు చేస్తున్నారు. ఆరు నెలలుగా ఇలా వినియోగదారులపై భారం వేస్తున్నారు.

ఆరు నెలల్లో సుమారు 50 వేల మీటర్లు మంజూరు

ప్రధాన పట్టణాలు, గ్రామాల్లో చాలా మంది అంతగా విద్యుత్ వాడరు.. పేదలు, స్లమ్ ఏరియాలో ఉండే వారు ఒక్క గదిలోనే.. ఒక్కలైటు, ఫ్యాన్‌తోనే జీవనం సాగిస్తుంటారు. అలాంటి వారు కూడా విద్యుత్ మీటర్లు పొందాలంటే రూ.3300 డీడీ తీయాల్సి రావడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ప్రతి నెలా 10 వేల వరకు కొత్త మీటర్లు మంజూరవుతున్నాయి. ఆరు నెలల నుంచి సుమారు 50 వేల వరకు కొత్త మీటర్లు మంజూరు చేశారు. ఇందులో దాదాపు 40 శాతం వరకు పేదలు మీటర్లు పొందారు. వీరంతా అవసరం లేకున్న అధిక లోడ్ మీటర్లు పొంది భారం మోశారు. వినియోగదారులు ఒక కిలోవాట్ మీటరుతీసుకుని అన్ని రకాల వస్తువులు వాడినా.. ఆ లోడ్‌కు తగినట్లు విద్యుత్ బిల్లు వస్తుంది. అయినా అధికారులు రెండు కిలోవాట్ల మీటరు తీసుకోవాలని చెప్పడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ విషయంలో అధికారులు ఆలోచించి అవసరానికి అనుగుణంగా మీటర్లు మంజూరు చేస్తే మంచిదని పలువురు పేర్కొంటున్నారు.

ఈ విషయమై వినియోగదారుల సేవా కేంద్రం అధికారిని వివరణ కోరగా.. పైఅధికారుల ఆదేశాను సారం డీడీలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎవరైనా పేదలు తాము అంత మొత్తం కట్టలేమని చెబితే.. వారికి ఒక కిలోవాల్ మీటర్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు.

వినియోగాన్ని బట్టి మీటర్లు..

గృహాల కనెక్షన్లకు సంబంధించి ఇంటి వినియోగాన్ని బట్టి విద్యుత్ మీటర్ పొందే అవకాశం ఉంది. ఇంట్లో వాడే పరికరాలు అధికంగా ఉంటే రెండుకిలో వాట్ల మీటర్ పొందాల్సి ఉంటుంది. అలా కాకుండా ఒక్క గది ఉంది.. ఏసీ, వాషింగ్‌మిషన్, ఫ్రిడ్జ్ తదితర వస్తువులు వాడనటువంటి వారికి ఒక కిలోవాట్ మీటర్ సరిపోతుంది. అయితే.. కిలో వాట్ మీటర్ పొందాలంటే రూ.1650 డీడీ విద్యుత్ శాఖ పేరున తీసి, సంబంధిత డాక్యుమెంట్లను వినియోగదారుల సేవా కేంద్రంలో ఇస్తే అధికారులు అన్ని విచారించి మీటర్ మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ, గత ఆరు నెలల నుంచి నల్లగొండ జిల్లాలో ఆ పద్ధతి మారింది. ఎవరు మీటర్ కావాలని వచ్చినా రెండు కిలోవాట్ల మీటర్ తీసుకోవాల్సిందే అని ఆదేశాలు ఇస్తున్నారు. కిలోవాట్‌కు సంబంధించి రూ.1650 డీడీలు ఇచ్చినా వినియోగదారుల సేవా కేంద్రంలో ఉద్యోగులు తీసుకోవడంలేదు. రెండు కిలోవాట్ల మీటర్‌కు రూ.3300 డీడీ తెస్తేనే తీసుకుంటున్నారు. ఈ నిర్ణయం వల్ల సంస్థకు ఆదాయం వస్తుందని సదరు అధికారులు భావించి ఉండొచ్చు కానీ.. పేదలపై మాత్రం మోయలేని భారం పడుతోంది.

అభివృద్ధిని వేగవంతం చేయాలి



సమావేశానికి హాజరైన సభ్యులు



మాట్లాడుతున్న చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

- జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ : ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 1, 7, 2, 3, 4, 5, 6వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆయా శాఖల మధ్య అధికారుల సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయాలన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రతి ఒక్క అధికారి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామంలో బెల్ట్ షాపులు రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారని.. దీని వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్న మండలాలు గుర్తించి.. వాటి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సుభద్ర మాట్లాడుతూ దామరచర్ల, దేవరకొండ అనుముల మండలాల్లో బాల్య వివాహాలు అధికంగా ఉన్నాయని, పాఠశాలలు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. డిండి జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మలకు ఏబీ స్విచ్చులు ఎన్నిసారు అడిగినా ఇవ్వడం లేదని, దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం తెలంగాణ ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించబడిన తిప్పన విజయసింహారెడ్డిని సన్మానించారు. సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, స్టాండింగ్ కమిటీ చైర్మన్లు ప్రవీణ, నారబోయి స్వరూపారాణి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

- దుమ్ములోనే ప్రయాణం..





ఈ ఫొటోలు చూశారా..
నల్లగొండలోని రామగిరి మీదుగా పానగల్ వెళ్లే రోడ్డు ఇది. ఆ రోడ్డు జాతీయ రహదారిగా మారడంతో ఇటీవల పనులు చేపట్టారు. అందులో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కోసం తీసిన గుంతల్లో కంకర డస్ట్ పోయడంతో ఇలా దుమ్ము లేస్తోంది.

క్రీడలతో మానసికోల్లాసం



క్యారమ్స్ ఆడుతున్న జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్

రామగిరి(నల్లగొండ) : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా జడ్జి బీఎస్.జగ్జీవన్‌కుమార్ పేర్కొన్నారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా నల్లగొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో న్యాయవాదులకు, సిబ్బందికి ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో బిజీగా ఉండే న్యాయవాదులు, సిబ్బందికి క్రీడా పోటీలు ఉత్సాహాన్ని నింపుతాయని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ పురుష మహిళా న్యాయవాదులకు సిబ్బందికి వేర్వేరుగా చెస్, క్యారమ్స్, వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంనందు క్రికెట్ పోటీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు కోర్టు జడ్జి జయరాజు, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి తిరుపతి, సీనియర్ సివిల్ జడ్జి తేజోకార్తీక్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, జవహర్‌లాల్, నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, కీసర శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్నకుమార్, ప్రశాంత్, కిషోర్‌కుమార్, కిరణ్‌కుమార్, అశోక్‌కుమార్, శంకరయ్య, శ్రీనివాస్, రాఘవ పాల్గొన్నారు.

నిర్మాణానికి నిధుల గ్రహణం

- నిలిచిన మిర్యాలగూడ సమీకృత మార్కెట్ పనులు
- ఈ ఏడాది జూన్ వరకు పూర్తి చేయాలని లక్ష్యం
- ఇప్పటి వరకు పునాది స్థాయిలోనే..
- మార్కెట్ నిర్మాణం పూర్తయితే పట్టణవాసులకు ఎంతో మేలు



బేస్మెంట్ స్థాయిలోనే నిలిచిపోయిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులు నిలిచిపోయాయి. ఇటీవల ప్రారంభమైన మార్కెట్ నిర్మాణ పనులు 2023 జూన్ వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు ముందుకు సాగారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో పునాది దశలోనే అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఎంతో మేలు జరుగుతుందని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.. కానీ ఈ నిర్మాణం ఆదిలోనే నిలిచిపోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి.

108 దుకాణాల నిర్మాణం..

మటన్, చికెన్, చేపలు, కూరగాయలు, పండ్లు, పూలతోపాటు ప్రజలకు కావాల్సిన అన్ని రకాల వస్తువులు ఒక్కే దగ్గర లభ్యం కావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీలో జనాభా, అవసరాలకు అనుగుణంగా ఎస్ఎస్‌పీ క్యాంపులో రెండెకరాల్లో ప్రతిష్ఠాత్మకంగా మార్కెట్ నిర్మాణం చేపట్టింది. రూ.4.50 కోట్ల వ్యయంతో 108 దుకాణాల నిర్మాణానికి పూనుకుంది. వీటిలో 30 దుకాణాలు మాసం, చికెన్, చేపల కోసం కాగా మరో 18 దుకాణాలు పూలు, పండ్ల వ్యాపారానికి కేటాయించగా మిగిలిన 60 దుకాణాలు మాత్రం కూరగాయాలకు కేటాయించాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఈ మార్కెట్‌కు వచ్చేందుకు రోడ్డు సౌకర్యంతో పాటు మార్కెట్‌కు దగ్గర్లోనే అన్నీ వసతులను కల్పించేందుకు పూనుకున్నారు.

ఉత్సవ విగ్రహంలా దర్శనం..

సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు మొదటి విడతగా కోటి రూపాయలు మంజూరు కాగా ఆ నిధులతో అధికారులు బేస్మెంట్ లెవల్ వరకు పనులు చేపట్టారు. ప్రస్తుతం నిధుల లేమితో నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోవడంతో ఉత్సవ విగ్రహంలా దర్శమిస్తోంది. నిధులు వెంటవెంటనే ఇచ్చి నిర్మాణ పనులు పూర్తిచేయిస్తే.. రోడ్లపైనే కూరగాయాలు, పండ్లు, మాసం, చికెన్ దుకాణాలు, తోపుడు బండ్లు కనిపించకుండా అన్నింటినీ ఒకే చోటు తరలించవచ్చు. తద్వారా మున్సిపాలిటీ శుభ్రంగా కినిపించడంతోపాటు, పట్టణ ప్రజల సమయం కూడా ఆదా అవుతుంది. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నిధులు రాగానే పనులను చేపడతాం

మున్సిపాలిటీలోని ఎస్ఎస్‌పీ క్యాంపులో రూ.4.50 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాలేదు. కోటి రూపాయల వరకు మంజూరు కావడంతో ఆ నిధులతో బేస్మెంట్ లెవల్ వరకు పనులను చేపట్టాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.
– బి.వెన్నెలకుమార్, పబ్లిక్ హెల్త్ ఏఈ

గొర్రెల యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి

నల్లగొండ టౌన్ : మునుగోడు ఉప ఎన్నిక ముందు జిల్లాలో మంజూరు చేసిన గొర్రెల యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పులు చేసి వేలాది రూపాయల డీడీలు చెల్లించిన 7వేల మందికిపైగా లబ్ధిదారులు యూనిట్లు గ్రౌండింగ్ చేయని కారణంగా వడ్డీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారులు కోరుకున్న ప్రాంతంలో గొర్రెలను కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. జిల్లా పశుసంవర్థక శాఖ అధికారులు, వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్యవంతమైన గొర్రెలు అందేలా చూడాలన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జానారెడ్డి

నిడమనూరు : కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చేలా అందరూ కలిసి కట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. సీఎం కేసీఆర్ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మళ్లీ ఎన్నికలు వస్తున్నా.. అమలు చేయలేదని మండిపడ్డారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నిడమనూరు పట్టణ శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. టౌన్ అధ్యక్షుడిగా కుంచం సతీష్, కార్యదర్శిగా యాదగిరి, యూత్ అధ్యక్షుడిగా కల్లు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేముల బాలరాజు, మహిళా అధ్యక్షురాలిగా చాంద్‌బీని నియమించారు. వీరితో పాటు పార్టీ అనుబంధ సంఘాలకు కార్యవర్గాలను నియమించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం, శివమారయ్య, సర్పంచ్ మేరెడ్డి పుష్పలత, మేరెడ్డి వెంకట్రామ్‌రెడ్డి, మట్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నర్సింగ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

2,774 పోస్టులు ఖాళీ

- ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు మార్గం సుగమం
- నేడో రేపో వెలువడనున్న షెడ్యూల్
- పదోన్నతిపై బదిలీ కానున్న 510 మంది
- 1655 మందికి సాధారణ బదిలీ



నల్లగొండ : జిల్లాలో ఉపాధ్యాయ ఖాళీల లెక్క తేలింది. జిల్లా వ్యాప్తంగా 2,774 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. దీంతో పదోన్నతులు, బదిలీలకు మార్గం సుగమం అయ్యింది. నేడో రేపో దానికి సంబంధించిన షెడ్యూల్ విడుదల కానుంది. ఈనెల 27 నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 5,600 మంది ఉపాధ్యాయులు ఉండగా 2,165 మందికి బదిలీలు జరుగనున్నాయి. అందులో 510 మంది టీచర్లు పదోన్నతులపై బదిలీ కానున్నారు. 1,655 మందికి తప్పనిసరిగా బదిలీ కానుంది. ఉమ్మడి సర్వీస్ రూల్‌ను ప్రభుత్వ టీచర్లు ఒప్పుకోనందున ఏ కేటగిరీ పరిధిలోని వారికి ఆ కేటగిరిలోనే బదిలీలు, పదోన్నతులు జరగనున్నాయి.

హెచ్‌ఎం పోస్టులను ప్రమోషన్లతోనే భర్తీ..

జిల్లాలో ప్రసుతం 101 గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 129 ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటికి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేనందున వాటన్నింటిని స్కూల్ అసిస్టెంట్లతో పదోన్నతులతో భర్తీ చేయనున్నారు. అన్ని కేటగిరిలలో 401 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండగా.. అందులో 30 శాతం పోస్టులు (121) డైరెక్టు రిక్రూట్‌మెంట్ ద్వారానే భర్తీ చేయాల్సి ఉంటుంది. మిగతా 70 శాతం (280) పోస్టుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ల(ఎస్‌జీటీ)కు పదోన్నతులు లభించనున్నాయి. మొత్తంగా ఈ సారి 510 మంది ఉపాధ్యాయులకు విద్యాశాఖ పదోన్నతులు కల్పించనుంది.

1655 మందికి తప్పని బదిలీలు..

జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఐదేళ్లు మించి పనిచేస్తున్న ఉపాధ్యాయులు 1,655 మంది ఉన్నారు. బదిలీ నిబంధన ప్రకారం ఒకే చోట ఐదేళ్లకు మించి పనిచేస్తున్న వారిని విద్యాశాఖ తప్పనిసరిగా బదిలీ కేటగిరిలో చేర్చింది. దీంతో 1,655 మంది బదిలీ కానుండగా 510 మంది పదోన్నతులపై ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు వెళ్లనున్నారు. తప్పనిసరి బదిలీ అయ్యే వారిలో అత్యధికంగా 1032 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లే ఉన్నారు.

ఉపాధ్యాయుల ఖాళీలు ఇలా..

కేటగిరి	ప్రభుత్వ పాఠశాలలు: ఖాళీలు	ప్రభుత్వ పాఠశాలలు: లాంగ్ స్టాండింగ్	జిల్లా, మండల పరిషత్‌లు: ఖాళీలు	జిల్లా, మండల పరిషత్‌లు: లాంగ్ స్టాండింగ్	మొత్తం
క్రాఫ్ట్	9	0	42	1	52
డ్రాయింగ్	6	0	7	0	13
జీహెచ్‌ఎం	11	0	90	50	151
ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం	2	6	127	33	168
ఎల్‌పీ హిందీ	2	1	12	51	166
ఎల్‌పీ తెలుగు	1	2	12	51	70
ఎల్‌పీ ఉర్దూ	2	3	0	1	06
మ్యూజిక్	2	0	2	0	04
పీఈటీ	1	0	5	22	28
ఎస్‌ఏ బయోసైన్స్	8	3	72	71	154
ఎస్‌ఏ ఇంగ్లీష్	7	4	56	41	108
ఎస్‌ఏ హిందీ	5	1	22	36	64
ఎస్‌ఏ మ్యాథ్స్	2	8	31	93	134
ఎస్‌ఏ ఫిజిక్స్ ఈఎన్‌డీ	1	0	09	5	15
ఎస్‌ఏ ఫిజిక్స్	2	8	4	50	64
ఎస్‌ఏ సోషల్	9	2	115	49	175
ఎస్‌ఏ తెలుగు	6	3	50	20	79
ఎస్‌ఏ ఉర్దూ	2	1	0	1	04
ఎస్‌జీటీ	32	31	344	1001	1408
ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్	1	0	10	1	12
మొత్తం	110	73	1009	1582	2774

క్లుప్తంగా

ఆటో చోరీ కేసులో వంద రోజుల జైలు

నిడమనూరు : ఆటో చోరీ కేసులో నిందితుడికి వంద రోజుల జైలు శిక్ష విధిస్తూ నిడమనూరు కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి మాధవి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ తెలిపిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దవూర మండల కేంద్రానికి చెందిన షేక్ లతీఫ్ స్థానిక వై జంక్షన్ వద్ద 2022 ఆగస్టు 25వ తేదీన ఇంటి ముందు ఆటోను పెట్టి, ఇంట్లో పడుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన మన్సూర్ అదేరోజు తెల్లవారుజామున అప్పి ఆటోను చోరీ చేశాడు. బాధితుడు లతీఫ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ పరమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. శుక్రవారం నిడమనూరు కోర్టులో తుది విచారణలో నేరం నిరూపణ కావడంతో షేక్ మన్సూర్‌కు వంద రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి మాధవి తీర్పు చెప్పారని కోర్టు లైజన్ ఆఫీసర్ అలీ తెలిపారు.

రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి

భువనగిరి : రైలు నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనపై రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్ జిల్లాకు చెందిన కలకోటి అభిలాష్(32) శుక్రవారం సికింద్రాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ఉదయం భువనగిరి మండలం పగిడిపల్లి–భువనగిరి రైల్వేస్టేషన్ల మధ్య ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఇన్‌చార్జ్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

తాటికల్‌లో వృద్ధుడి దారుణ హత్య

- గొంతు నులిమి చెరువులో పడేసిన బావమరిది, అతడి ఇద్దరు కుమారులు
- భూ వివాదాలతోనే ఘాతుకం
- పోలీసులు అదుపులో ఒకరు.. పరారీలో ఇద్దరు

నకిరేకల్ : భూ తగాదాల నేపథ్యంలో ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. నకిరేకల్ మండలం తాటికల్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు, హతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామానికి చెందిన ఆకిటి వెంకటయ్య (62) చిన్నతనంలో తాటికల్ గ్రామానికి వచ్చి స్థిరపడిపోయాడు. ఈ గ్రామ వాసినే వివాహం చేసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కాగా, అందరికీ వివాహాలు జరిపించాడు.

ఏళ్లుగా బావమరిదితో భూ వివాదం

వెంకటయ్య సొంత బావమరిది అయిన ఇదే గ్రామ వాసి వనం సైదులుతో కలిసి కొన్నేళ్ల క్రితం తాటికల్ శివారులోని గుట్ట వద్ద కొంత భూమిని కొనుగోలు చేశాడు. అయితే, ఈ భూమి విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో 2013లో వనం సైదులు తన బావ వెంకటయ్యపై దాడి కూడా చేశాడు. అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగినా రెండు కుటుంబాల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు.

ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

చెరువులో అనుమానాస్పదంగా వ్యక్తి మృతిచెందాడన్న సమాచారం అందుకున్న సీఐ వెంకటయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం


కన్నీరుమున్నీరవుతున్న హతుడి భార్య, కుటుంబ సభ్యులు


ఘటన స్థలం వద్ద విచారణ జరుపుతున్న సీఐ వెంకటయ్య తదితరులు

మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన తండ్రిది అనుమానాస్పద మృతి కాదని వనం సైదులు, అతడి ఇద్దరు కుమారులు నాగరాజు, గోపి చెరువు వద్ద కాపుకాసి హత్య చేశారని హతుడి కుమారుడు ఆకిటి సైదులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటకయ్య హత్యకు రెండు కుటుంబాల మధ్య పాత కక్షలు, భూ తగాదాలు, మరేమైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు వనం సైదులు, అతడి ఇద్దరు కుమారులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. కాగా, ఈ కేసులో సైదులు పెద్ద కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా సైదులు, అతడి చిన్న కుమారుడు పరారీలో ఉన్నట్లు తెలిసింది.


వెంకటయ్య మృతదేహం

గ్రామంలో ఉద్రిక్తత

సమీప బంధువులే ఆకిటి వెంకటయ్య(52)ను హత్య చేసినట్టు వార్త దహనంలా వ్యాపించడంతో తాటికల్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాటికల్ గ్రామంలో వారం రోజుల క్రితం భూ తగాదాల నేపథ్యంలో ఓ వర్గం వారు మరో వర్గం వారి ఇంటిపై గొడ్డళ్లు ,కత్తులతో దాడి చేసి బీభత్సం చేసి మహిళను బెదిరించిన విషయం తెలసిందే. తాజాగా ఇదే గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరుగుతున్న గొడవల్లో ఒకరి హత్య జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

చెరువు వద్ద మాటేసి..

భూ వివాదం నేపథ్యంలో సైదులు బావ వెంకటయ్యపై కోపం పెంచుకుని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అందుకు అదును కోసం వేచి చూస్తున్నాడు. అయితే ఆకిటి వెంకటయ్య రోజు మాదిరిగా శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంటి సమీపంలోని ముత్యాలమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే తన ఇద్దరు కుమారులు నాగరాజు, గోపితో మాటేసి ఉన్న సైదులు ఒక్కసారిగా వెంకటయ్యపై దాడి చేశారు. ముగ్గురు కలిసి వెంకటయ్య గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని చెరువులో పడేసి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందినట్టు చిత్రీకరించి అక్కడి నుంచి పరారయ్యారు. కొద్ది సేపటి తర్వాత అటువైపుగా వెళ్లిన గ్రామస్తులు చెరువులో వెంకటయ్య మృతదేహం తేలియాడుతూ ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI / SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 99124 40783, 96660 13544

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

పురుగుల మందు తాగి ఇద్దరి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం
- చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఘటన

చిట్యాల : ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిట్యాల మండల పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన పసునూరి వెంకటేశ్వర్లు(55)కు వివాహం కాగా భార్యతో పాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయినప్పటికీ వెంకటేశ్వర్లు నార్కట్‌పల్లి మండలానికి చెందిన తన చినమామ కూతురు వరుసకు మరదలైన, ఇద్దరు కుమారులున్న ధనలక్ష్మి(45)ని తీసుకుని 18 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడే హస్తినాపురంలో కిరాణ దుకాణం నడుపుకుంటూ ధనలక్ష్మి ఆమె ఇద్దరు కుమారులతో కలిసి సహజీవనం చేస్తున్నాడు.

అప్పులు అధికమై..

అయితే, వెంకటేశ్వర్లుకు ఇటీవల కాలంలో అప్పులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక సహజీవనం చేస్తున్న ధనలక్ష్మితో కలిసి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలోనే గురువారం సాయంత్రం ఇద్దరు కుమారులను అక్కడే ఉంచి ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు చిట్యాల మండలం వెలిమినేడు శివారులోని రసాయన పరిశ్రమ సమీపంలోని కొంటుగుట్టల్లోకి చేరుకున్నారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్న పురుగుల మందును కూల్ డ్రింక్స్‌లో కలుపుకుని ఇద్దరు తాగారు. అయితే, తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని, వెలిమినేడు శివారులోని గుట్టల్లో ఉన్నట్లు ధనలక్ష్మి తమ బంధువులకు ఫోన్‌లో అదే రోజు సాయంత్రం సమాచారం ఇచ్చింది.

అర్ధరాత్రి వరకు వెతికినా..

ధనలక్ష్మి ఫోన్‌లో ఇచ్చిన సమాచారం మేరకు ఆమె బంధువులతో పాటు పోలీసులు వెలిమినేడు శివారులోని గుట్టల్లో గురువారం అర్ధరాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం మరోమారు వెతకడంతో వారు గ్రామ శివారులోని కొంటుగుట్టపై ధనలక్ష్మితో పాటు వెంకటేశ్వర్లు విగతజీవులుగా కనిపించారు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కాగా, తాము అప్పుల బాధతోనే అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు మృతుల వద్ద లభించిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరి మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అప్పగించారు. మృతుడు వెంకటేశ్వర్లు మొదటి భార్య కుమారుడు అవినాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల పోలీసులు తెలిపారు.


ఘటనా స్థలంలో ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు మృతదేహాలు


దామెరలో ఉరేసుకుని యువకుడు..

చౌటుప్పల్ : మండల పరిధిలోని దామెర గ్రామంలో శుక్రవారం యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఊడుగు లక్ష్మణ్‌దాస్‌గౌడ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి కుమార్తెతో పాటు కుమారుడు ఊడుగు హరీష్‌గౌడ్(19) ఉన్నారు. కుమారుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల హరీష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అందులో భాగంగా పదిహేను రోజులుగా ఇంటి వద్దే ఉన్నప్పటికీ తల్లిదండ్రులతో మాట్లాడకుండా దిగాలుగా ఉన్నాడు. ఏం జరిగిందని అడిగినా ఎలాంటి సమాధానం చెప్పలేదు. ఆ క్రమంలో శుక్రవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఆటో కిరాయికి వెళ్లిన తండ్రి గంట సేపటి తర్వాత తిరిగి వచ్చాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లగా కుమారుడు పూజ గదిలో దూలానికి చీరతో ఉరివేసుకొని వేలాడుతూ కన్పించాడు. పరిశీలించగా అప్పటికే చనిపోయాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అనిల్ తెలిపారు.


హరీష్ మృతదేహం

ఆర్థిక ఇబ్బందులతో గీత కార్మికుడు..

భూదాన్‌పోచంపల్లి : ఆర్థిక ఇబ్బందులతో ఓ గీత కార్మికుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.ఈ ఘటన మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పలాయిపల్లి గ్రామానికి చెందిన బత్తుల రాజుగౌడ్ (35) కులవృత్తిపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నాడు. రోజుమాదిరిగానే గురువారం సాయంత్రం కల్లు గీసేందుకని స్నేహితుడి బైక్ తీసుకొని ఇంటి నుంచి బయలుదేరాడు. అనంతరం రాత్రి 6.30 గంటల సమయంలో తండ్రి ముత్యాలుతో పాటు కూతురు కావ్యకు ఫోన్ చేసి అప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, తనకు జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నానని తెలిపాడు. అనంతరం ఫోన్‌స్విచాఫ్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాజు కోసం రాత్రంతా చుట్టుపక్కల, తెలిసిన చోటల్లా వెదికినా ఆచూకీ లభించలేదు.


రాజుగౌడ్(ఫైల్)

దేశ్‌ముఖి శివారులో చెట్టుకు ఉరివేసుకొని..

కాగా బత్తుల రాజు గురువారం రాత్రి దేశ్‌ముఖి శివారులోని మోడల్‌హిల్స్ వెంచర్‌లోని వేపచెట్టుకు నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. శుక్రవారం దేశ్‌ముఖి గ్రామానికి చెందిన దాసర్ల శ్రీశైలం అటుగా వెళ్లగా చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసి భయపడి, విషయం గ్రామస్తులకు, ఇటు పోలీసులకు తెలిపారు. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపారు.

● పెద్దగట్టు ముస్తాబు

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఏర్పాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు జాతర జరగనుండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నారు. అదే విధంగా ఆలయానికి రంగులు ఇతర సుందరీకరణ పనులు చేస్తున్నారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సూర్యాపేట


పెద్దగట్టు ఆలయ సింహ ద్వారం


పెద్దగట్టుపై వేస్తున్న చలువ పందిళ్లు


స్తంభాలకు విద్యుత్ బల్బులు అమరుస్తున్న సిబ్బంది



రంగులు వేస్తున్న కూలీ, మంచినీటి కోసం నిర్మిస్తున్న ట్యాంక్

ప్రాణం తీసిన కుటుంబ కలహాలు

- మోతె మండలం హుస్సేనాబాద్ వాసి హైదరాబాద్‌లో బలవన్మరణం
- భవనం పైనుంచి దూకి అఘాయిత్యం
- స్వగ్రామంలో విషాదఛాయలు

మోతె : కుటుంబ కలహాలు ఓ వివాహిత ప్రాణం తీశాయి. మోతె మండలం హుస్సేనాబాద్ వాసి హైదరాబాద్‌లో భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోగా స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేనాబాద్ గ్రామానికి చెందిన బైరపంగు నవ్య (25) ఇదే గ్రామానికి చెందిన కిరణ్ ఎనిమదేళ్ల క్రితం ప్రేమించుకుని పెద్దల అంగీకారంతో వివాహం చేసుకున్నారు. వీరికి ఆరేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. కొంతకాలం క్రితం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల నూతనంగా నిర్మిస్తున్న ఓ భవంతికి వాచ్‌మెన్లుగా ఉంటూ అక్కడే నివసిస్తున్నారు. అయితే, సాఫీగా సాగుతున్న వీరి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఈ క్రమంలోనే దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో నవ్య తీవ్ర మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే నవ్య శుక్రవారం తెల్లవారుజామున తాము నివసిస్తున్న భవంతి పైనుంచి దూకి అఘాయిత్యానికి ఒడిగట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సమీప ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.


నవ్య(ఫైల్)

మిన్నంటిన రోదనలు

కాగా, ఆత్మహత్య చేసుకున్న నవ్య మృతదేహానికి హైదరాబాద్‌లోనే పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగ్రామం హుస్సేనాబాద్‌కు తీసుకొచ్చారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు కళ్లెదుటే విగతజీవిగా కనిపించడంతో నవ్య తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. తల్లిని కోల్పోయిన చిన్నారులను హత్తుకుని గుండెలవిసేలా రోదించారు.

వరిలో తెగుళ్ల ఉధృతి.. నివారణ చర్యలు

- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ భరత్ సూచనలు



త్రిపురారం : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగవుతున్న వరి పంటలకు చీడపీడల ఉధృతి అధికంగా ఉంది. దీని నివారణకు తప్పనిసరిగా సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ప్రస్తుతం వరి పంటలో శాస్త్రవేత్తలు గుర్తించిన చీడపీడలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కేవీకే కంపాసాగర్ సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ భరత్ మాటల్లో..

కాండం తొలుచు పురుగు నివారణకు..

వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి అధికంగా ఉన్నందున నివారణకు 2 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా 10 కిలోల కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జి గులికలు లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ గులికలు ఎకరం పొలానికి వేసుకోవాలి.


త్రిపురారంలో అగ్గితెగులు సోకి గిడసబారిన వరి పైరు


కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ భరత్

వరి ఆకులు ఎండిపోతుంటే..

వరి పంటలో ఆకులు ఎండిపోతూ, పంట గిడసబారి అగ్గి తెగులును గుర్తించిన వెంటనే నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రోథమోలిన్ లేదా 2.5 మి.లీగాసుమైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఉల్లికోడు పురుగు నివారణకు..

వరి పంటలో ఉల్లికోడు పురుగు ఉధృతిని గమనించిన వెంటనే నివారణకు 2 మి.లీ కార్బోసల్ఫాన్ లేదా ఫిప్రోనిల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ లేదా 4 కిలోల ఫిప్రోనిల్ 0.6 జి గులికలను ఎకరానికి వేసుకోవాలి.

కాలిబాటలు తప్పనిసరి

వేసవి కాలంలో పొలం నాటిన తర్వాత ఉత్తరం – దక్షిణం ఉండే విధంగా ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్లు ఉండేటట్లు తప్పనిసరిగా కాలిబాటలు తీసుకోవాలి. దీంతో వరి పైరుకు గాలి, వెలుతురు బాగా సోకి చీడపీడల ఉధృతి తగ్గుతుంది. కాలి బాటల్లో నడుచుకుంటూ ఎరువులు చల్లుకోవడం, పురుగు మందులు పిచికారీ చేసుకోవచ్చు. అదేవిధంగా చలి ఉధృతి ఎక్కువగా ఉండడంతో వరి పంట వేర్లు కుళ్లిపోయి వాసన రావడం జరుగుతుంది. రైతులు సకాలంలో పంటను గమనించి నివారణకు వెంట్రుక మందం తేమ ఉండేవిధంగా ఎండగట్టాలి. అదేవిధంగా కార్బండిజమ్ ఒక గ్రాము లేదా ప్రోపకోనాజోల్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.